

గొండిలిలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని గొండిలి గ్రామంలో సోషల్ ఆర్మీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తచైతన్యకర్త గణేష్ కొమ్మోజు, మెడికవర్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ జమాల్ బాషా ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన 220 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నిరంజన్, దీపక్, సోషల్ ఆర్మీ యూత్ ఫౌండర్ మనోజ్, కోటి, పురుషోత్తం, దీపక్, మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది , అభి, వెంకట్రావు, వాలంటీర్స్ పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

ఆహ్లాద నిలయం..అరుకు పద్మాపురం


-విహారంతో పాటు ఇక విడిది
-పర్యాటకులకు "ట్రీ కాసిల్"
-గిరిటేజ్ క్యాంటీన్, వీడీవీకే షాప్..
-నేటి నుంచి అందుబాటులోకి కాటేజీలు



ప్రజాశక్తి పాడేరు,అరకులోయ: ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన అందాల అరకులోయ పద్మాపురం గార్డెన్స్ అంటే తెలియని, చూడని వారు ఉండరు. అందమైన పూల చెట్లు వివిధ రకాల పండ్ల చెట్లు, అందమైన పగోడాలు, ఉద్యానవన విహారానికి టాయ్ ట్రైన్ తోపాటు పిల్లల కోసం పెద్దల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులు మరెన్నో అందమైన ఆకృతులతో అందంగా తీర్చబడిన పద్మాపురం గార్డెన్స్‌లో ఇప్పుడు ఉద్యాన విహారంతో పాటు పర్యాటకులు విడిది చేసేందుకు "ట్రీ కాసిల్" పేరుతో ఆరు కాటేజీలను ఐటిడిఏ అందుబాటులోకి తెచ్చింది. గతంలో ఈ పద్మాపురం గార్డెన్‌లో ట్రీ హాట్స్ ఉండేవి. ఇవి శిథిలం కావడంతో కొత్తగా ట్రీ కాసిల్ పేరుతో సుమారు 36 లక్షల వ్యయంతో ఆధునిక వసతులతో ఆరు కాటేజీలతోపాటు ఆరు పగోడాలను నిర్మించారు. ఈ నెల 2 నుంచి ఈ కాటేజీలు పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి. పద్మాపురం గార్డెన్స్‌లో సుమారు నాలుగు ఎకరాల సువిశలమైన ప్రాంగణంలో ఈ "ట్రీ కాసిల్ "ను తీర్చిదిద్దారు. నేచురల్‌గా కనిపించే విధంగా రాళ్లతో వాటర్ ఫౌంటెన్‌తో పాటు కాటేజీలలో ఉండే పర్యాటకుల కోసం ఆరుబయట కూర్చుని పూల తోటల మధ్య ప్రకృతిని ఆస్వాదించేందుకు ప్రత్యేకంగా ఆరు పగోడాలను నిర్మించారు. విద్యుత్ దీపాలంకరణతో గార్డెన్ నవీకరించారు. కాటేజీల్లో బస చేసే వారి కోసం కాట్స్ ఫర్నిచర్ వంటి ఖరీదైన సౌకర్యాలు కల్పించారు. ఈ కాటేజీల్లో శుక్ర, శని, ఆదివారాల్లో ఉండేందుకు రూ.4వేల ధర, మిగిలిన రోజుల్లో 3500 ధర నిర్ణయించారు. ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలతో ఒక కుటుంబం ఒక కాటేజీలో ఉండడానికి వీలు కల్పించారు. ఇక్కడ బస చేసే పర్యాటకుల కోసం గిరిటేజ్ క్యాంటీన్ పేరుతో ఒక రెస్టారెంట్ ను ఏర్పాటు చేశారు. అలాగే ట్రీ కాసిల్ లో ఉండే పర్యాటకులకు గార్డెన్, ట్రైబల్ మ్యూజియం ప్రవేశ రుసుము, రెస్టారెంట్లో బ్రేక్ ఫాస్ట్ ఉచితం కల్పించారు. ఈ రెస్టారెంట్లో గిరిజన వంటకాలు లభించడం మరొక ప్రత్యేకం! అలాగే ఈ ప్రాంగణంలో వన్ దన్ వికాస్ కేంద్రం పేరుతో కాఫీ, రాజ్మా, తేనే తదితర గిరిజన ఉత్పత్తులు లభించే షాపును పర్యాటకుల సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పద్మాపురంలో నూతనంగా నెలకొల్పిన ఈ ట్రీ కాసిల్ అరకు పర్యాటకానికి అదనపు ఆకర్షణ కానుంది.



నూతనంగా నిర్మించిన కాటేజీలు



ట్రీ కాసిల్

జలపాతంలో సౌకర్యాలు మెరుగు.

పాడేరుకు సమీపంలోని జిమాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతం పర్యాటకులను అమితంగా ఆకట్టు కుని ఎంతో ప్రాచుర్యం పొందింది. ఐటిడిఏ గతంలో ఇక్కడ సుమారు కోటి రూపాయలు పైగా నిధులు వెచ్చించి అభివృద్ధి చేసింది. పర్యాటకుల విజ్ఞప్తి మేరకు తాజాగా మరో 10 లక్షల రూపాయల నిధులతో సౌకర్యాలు మెరుగు పరిచేందుకు పలు అభివృద్ధి పనులు ఐటీడీఏ నిర్వహిస్తోంది. ఈ జలపాతాన్ని పర్యాటకులు కింద వరకు వెళ్లి చూసేందుకు వీలుగా రేయిలింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారు. పర్యాటకులకు సౌకర్యవంతంగా కొత్తపల్లి జలపాతాన్ని తీర్చిదిద్దు తున్నారు.

రూ 36 లక్షలతో 12 కాటేజీలు...

అరకులోయలోని కొత్తవలస హెచ్ఎంటిసి ఫారం లో పర్యాటకుల విడిది కోసం 36 లక్షల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో 12 కాటేజీలను ఐటిడిఏ నిర్మిస్తోంది. రోజుకు ఒక కాటేజీకి 2000 రూపాయలు చొప్పున అద్దె నిర్ణయించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తుంది. అరకు సమీపంలోని కొల్లా పుట్ లో పర్యాటకుల కోసం నిర్మించిన 12 కాటేజీలు పర్యాటకులకు ఎంతో ఆకర్షణీయంగా సౌలభ్యంగా ఉన్నాయి. గిరి గ్రామదర్శిని పేరుతో పెదలబుడు లో నిర్మించిన 14 కాటేజీలు పర్యాటకులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆధునిక సౌకర్యాలతో పాటు ఆహ్లాదాతన్ని అందించే విధంగా కొండల నడుమ కాటేజీలను అందంగా తీర్చిదిద్దారు. పాడేరు ఏజెన్సీలో ఐటీడీఏ ద్వారా జరుగుతున్న పర్యాటకాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారులు పర్యవేక్షణలో ఒక ప్రత్యేక శైలిని విశిష్టతని ఏర్పరచుకున్నాయి.

ఉపాధి కల్పన లక్ష్యం

పాడేరు ఏజెన్సీలో ఇది యువతకు ఉపాధి కల్పన లక్ష్యంతో పర్యాటకుల్ని ఆకట్టుకునే ప్రాంతాల్లో ఐటీడీఏ ద్వారా అభివృద్ధి చేస్తున్నాం. కొత్తపల్లి జలపాతం, పద్మాపురం గార్డెన్స్, కొల్లా పుట్, గిరి గ్రామదర్శిని, కొత్తవలస హెచ్ ఎన్ టి సి వంటి పర్యాటక ప్రాంతాల్లో సుమారు 130 మంది గిరిజనులకు ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. గిరిజన యువతకు శాశ్వత ఉపాధి కల్పన లక్ష్యంగా ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధి పై ప్రత్యేక దృష్టితో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాము.



వి అభిషేక్
ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి
పాడేరు



గర్భిణి మంగమ్మను డోలికట్టి మోసుకొస్తున్న గ్రామస్తులు

డోలీమోతతో గర్భిణి ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధిలో ఉన్న గరిమండ గ్రామానికి చెందిన గర్భిణి బోనంగి మంగమ్మను డోలిమోతతో ఆదివారం ఆసుపత్రికి తరలించారు. గరిమండ గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. గ్రామం నుంచి ఎటు వెళ్లాలన్నా ఐదారు కిలోమీటర్ల పైబడి కాలినడకన వెళ్లాల్సిందే. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లడానికి దారి లేదు. ఈ నేపథ్యంలో బోనంగి మంగమ్మకు ఆదివారం ఉదయం పురుటి నొప్పులు రావడంతో గ్రామస్తులు డోలికట్టి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బూదరాళ్ల వెళ్లే ప్రధాన రహదారి వరకు కాలినడకన మోసుకొచ్చారు. అక్కడి నుండి 108 వాహనంలో రాజేంద్రపాలెం పిహెచ్‌సికి తరలించారు. రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన రైతులు

వ్యవసాయాభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని ఐ.పోలవరం గ్రామంలో వారాహ క్లమేట్ ఆగ్ ఆధ్వర్యంలో గిరిజన మిత్ర ద్వారా రైతులకు వాతావరణ మార్పులు, వ్యవసాయ అభివృద్ధిపై అవగాహహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బంధం శ్రీదేవి మాట్లాడుతూ ఆగ్రో ఫారెస్ట్రీ ద్వారా గిరిజన చిన్నకారు రైతుల జీవనోపాధిని మెరుగుపర్చడం జరుగుతుందని చెప్పారు. కార్బన్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ ద్వారా నమోదు చేసుకున్న రైతులందరికీ అదనపు ఆదాయ వనరులుగా డబ్బు, మొక్కల రూపంలో ఉపయోగ పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన మిత్ర ప్రతినిధి డాక్టర్ ఉదయ్ శ్రీనివాస్, వారాహి టీమ్ లీడర్ శివకుమార్, సిబ్బంది అరవింద్‌కుమార్, కార్తిక్, అప్పన్న, నాగేశ్వరరావు, లింగబాబు, శివజ్, బుల్లి దొర, గిరిజన రైతులు పాల్గొన్నారు.



బొర్రా గుహల్లో పర్యాటకులు

పోటెత్తిన పర్యాటకులు

-బొర్రా గుహలు కిటకిట -ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి- అనంతగిరి: అనంతగిరిలో ప్రముఖ పర్యాటక కేంద్రాలకు వేలాదిమంది పర్యాటకులు పోటెత్తారు. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో ఉద్యోగులు కుటుంబాలతో తరలి వచ్చారు. అనంతగిరి, బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలతో పాటు డమ్ముకు, సుంకరమట యు పాయింట్, అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ తదితర ప్రాంతాలు కిటకిట లాడాయి. కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపారు. బొర్రా గుహల ఏర్పడిన విధానంపై గాడ్స్, సిబ్బందిని పర్యాటకులు అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ అంతరాయంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.



పర్యాటక కేంద్రం వద్ద వాహనాలు

55 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 55 కేజీల గంజాయి, రూ.85,500 నగదు స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్ర వాహనదారున్ని ఆపి తనిఖీ నిర్వహించగా గంజాయి, నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ద్విచక్ర వాహనతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా కుమ్మిడి సింగి పంచాయతీ గద్దెరాయ గ్రామానికి చెందిన వంతల కొండబాబు గా గుర్తించారు. నిందితుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



నిందితుడితో పోలీసులు

నేడు సామూహిక మరుగుదొడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అరకులోయ: గాంధీ జయంతిని పురస్కరించుకొని అరకులో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అరకు స్వచ్ఛతా కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంధ్ర డైరెక్టర్ శోభ సోమేశ్వరి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ప్రపంచ చిత్రపటంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న అరకులో స్వచ్ఛతకు సంబంధించి తొలి అడుగులు వేయబోతున్నామని ఆమె అన్నారు. దీనిలో భాగంగానే సోమవారం అరకు మండల కేంద్రంలోని సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నామన్నారు.

పలు చోట్ల 'స్వచ్ఛతా హీ సేవా'



పాడేరులో పాల్గొన్న జెసి శివ శ్రీనివాస్, ఐటిడిఏ పిఒ అభిషేక్ తదితరులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల శ్రమదానంతో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు.

స్వచ్ఛత హై సేవ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం పాడేరు ఐటీడీఏ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ జె. శివశ్రీనివాసు మాట్లాడుతూ మన పరిసరాలు మనమే శుభ్రపరచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం మెరుగు పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, సర్పంచ్ ఉషారాణి, డిపిఓ కొండలరావు పాల్గొన్నారు. పెదబయలులో చెత్తా చెదారం తొలగించారు. జి.మాడుగులలో ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక పోలీసులు పలుచోట్ల స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. డుంబ్రిగుడ మండలం అరుకు పంచాయితీలో సర్పంచ్ శారద ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతగిరి మండలం కాశీపట్నంలో స్థానిక సిపిఎం జెడ్పిటిసి. గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణి ఆధ్వర్యాన పరిసరాల ప్రాంతాల పరిశుభ్రత పనులను చేయించారు. గంగరాజు మాట్లాడుతూ, గ్రామాల్లో పరిశుభ్రత పాటించినప్పుడే ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో. మొస్య, అనంతగిరి సోమ్మెల. రూతు, కొర్రా. సింహాద్రి, బొర్రా అప్పారావు పాల్గొన్నారు.

జికె.వీధి మండలం, సీలేరులో సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ డిఎస్పీ సురేష్, ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, సీలేరు సర్పంచ్ దుర్గో, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేశారు. మెయిన్ బజార్లో చీపురు పట్టుకొని పరిశుభ్రత చేశారు. ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ కె.శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. కొయ్యూరు మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఎంపిపి బడుగు రమేష్, వైస్ ఎంపిపి అంబటి నూకాలమ్మ పాల్గొన్నారు. అడ్డతీగల మండల కేంద్రంలో ఇఒపిఆర్‌డి దాని చిన్నబ్బులు, పంచాయితి కార్యదర్శి శ్రీను, సచివాలయం సిబ్బంది ఉదయం 8 నుండి 10 గంటల వరకు శ్రమదానం చేశారు. విఆర్.పురం మండల కేంద్రంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గ్రామ శివారులోని సంత సముదాయం వద్ద రోడ్ల మీద చెత్తను తొలగించి, తగలబెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ములకాల సాయికృష్ణ, కోట్ల రామ్మోహన్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాశీపట్నంలో పారిశుధ్య పనుల్లో పాల్గొన్న జెడ్‌పిటిసి గంగరాజు తదితరులు

సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని టేకులబోరు గ్రామంలో సిపిఎం నాయకులు ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన గ్రామశాఖ సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అణగారిన వర్గాల ప్రజలు నివాస ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. రోడ్లు, మంచినీరు, విద్యుత్ లైట్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. తక్షణమే గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని కోరారు. లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వెంకన్నబాబు, వీరబాబు తదితరులు శ్యామల కృష్ణ, తాళ్లూరి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి సీతారామయ్య, నాయకులు



ఆర్థిక సాయం అందిస్తున్న తాపీ పనివాళ్ల సంక్షేమ సంఘం నాయకులు

గాయపడిన కార్మికులకు యూనియన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అడ్డతీగల

ప్రమాదంలో గాయపడిన కార్మికులకు శ్రీవినాయక తాపీ పనివాళ్ల సంక్షేమ సంఘం తరుపున ఆదివారం ఆర్థిక సాయం అందించారు. పని ప్రదేశంలో ప్రమాదవశాస్తు కాలు జారి పడి కాలు విరిగిపోయిన బెల్లం సూరిబాబుకు రూ.2000, పనికి వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదంలో గాయపడిన బట్ట శ్రీనుకు రూ.1000 సంఘం అధ్యక్షులు నక్క పెంటారావు, ఉపాధ్యక్షులు చాగంటి ఆదినారాయణ, కార్యదర్శి జి.సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. యూనియన్‌లో ఉన్న వారికి ఏ కష్టం వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగం పెద్దకాపు, వీరబాబు, రాజు, తలారి శ్రీను, ఉప్పులురి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న మండల నాయకులు

ప్రజాశక్తి -అడ్డతీగల

విజయవాడలో జరుగుతున్న యుటిఎఫ్ 50 సంవత్సరాలు స్వర్ణోత్సవ కార్యక్రమానికి అడ్డతీగల మండలం నుండి యుటిఎఫ్ మండల అధ్యక్షుడు బి.దొరబాబు ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు తరలివెళ్లారు. విజయవాడ వెళ్లిన వారిలో యుటిఎఫ్ నాయకులు అడపా రామారావు, అబ్బులు, నాగప్రసాద్, తేజ, మంగరాజు, రాఘవులు, సడేల మూర్తి, ఎన్ ఈశ్వరరావు, రవణమ్మ, గంగాభవాని, వెంకటప్రభ, సత్యవతి, లావణ్య, చంటమ్మ, తదితరులున్నారు.



స్వర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్న యుటిఎఫ్ మండల నాయకులు



నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర

ప్రొఫెసర్ రాధాకృష్ణకు నివాళి

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో ఎంపీడీవో సమావేశం మందిరంలో ఆదివాసి గిరిజన ఉద్యోగ సంఘం నాయకుల ఆధ్వర్యంలో కీర్తిశేషులు, ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీ చైర్పర్సన్ సుభద్ర పాల్గొన్నారు. ఆమె ప్రొఫెసర్ రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గిరిజన ప్రాంతం నుండి విద్యావంతుడుగా ఉన్నత స్థాయి చేరి ఆంధ్ర యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేసి , గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ1 పాటుబోయి సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా త్రినాథ్, వైసిపి నాయకులు గాసిరం, టిడిపి సీనియర్ నాయకులు గడ్డంగి రామ్మూర్తి, శంకర్రావు, మండల గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయుల సంఘం నాయకులు భాజంగి బాబురావు, కొండపడాల్, తిరుపతిరావు, సీఆర్పీ గౌరీ శంకర్ పాల్గొన్నారు.

ఉద్యానవన సహాయకులను నియమించాలి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: గ్రామ ఉద్యానవన సహాయకుల హేతుబద్ధీకరణ తక్షణమే నిలుపుదల చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు శెట్టి రాజు, కె.దశరధ రామ్, కె.గణపతి, రజిత, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సంయుక్తంగా ఆదివారం ప్రకటన విడుదల చేశారు.అల్లూరి జిల్లా పరిధిలో గ్రామ ఉద్యానవన సహాయకులు అవసరమైన స్థానాల్లో జిల్లా వ్యాప్తంగా 122 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీటితో పాటు ఉద్యానవన విస్తీర్ణాన్ని పరిగణలోకి తీసుకొని అదనంగా 73 పోస్టులను భర్తీ చేయాల్సి ఉన్నప్పటికీ, హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా పోస్టులను కుదించడం సరికాదని పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో నిధులు నిర్వహిస్తున్న గ్రామ ఉద్యానవన సహాయకులు పోస్టులను పూర్తిగా కుదించడం జరిగిందని తెలిపారు. వాస్తవానికి పెదబయలు, హుకుంపేట, ముంచింగిపుట్టు మండలాల్లో ఉద్యాన విస్తీర్ణం అధికంగా ఉన్నా, ఉద్యానవన సహాయకుల పోస్టులను పూర్తిగా కుదించటం జరిగిందని అన్నారు. అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి జరుగుతోందని క్షేత్రస్థాయిలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని బట్టి జిల్లాలో పనిచేస్తున్న సహాయకుల స్థానాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అవసరమైన మేరకు ఉద్యానవన సహాయకుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులు : కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కళలను, కళాకారులను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాలను, సబ్సిడీలను, సంక్షేమ కార్యక్రమాలను వినియోగించుకునేందుకు, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉపయోగపడే విధంగా రాష్ట్రస్థాయి గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ కళారూపాల కళాకారులు తమ పేరు, తండ్రిపేరు, జెండర్, పుట్టిన తేది, బ్లడ్ గ్రూపు, శాశ్వత చిరునామా, ప్రావీణ్యత ఉన్న కళ, సంబంధిత కళలో అనుభవం, ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు, ఇ-మెయిల్ తదితర వివరాలతో, రెండు పాస్ పోర్టు ఫొటోలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఉపసంచాలకులు, విశాఖ జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయానికి ఈ నెల 8వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖా కార్యాలయంలో ఎవి సూపర్‌వైజర్‌ను (9441249410) సంప్రదించాలని సూచించారు.

'ఆరోగ్య సురక్ష' పై విధి విధానాలు ప్రకటించాలి

ప్రజల ఆరోగ్య డేటాకు భద్రత కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: ఆరోగ్య సురక్ష పేరుతో ప్రారంభించిన కొత్త పథకం విధి విధానాలు ప్రకటించాలని, ప్రతి కుటుంబం నుంచి సేకరిస్తున్న ప్రజల ఆరోగ్య డేటాకు భద్రత కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై పలు సందేహాలు వ్యక్తపరిచారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ మొదలగు వైరల్ ఫీవర్స్‌తో వణికిపోతున్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన ప్రాథమిక వైద్య కేంద్రాల్లో డాక్టర్లను నియమించాలని, మందులను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేషెంట్లకు పరీక్షలు ఉచితంగా చేసి తక్షణ వైద్యం అందించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో అంబులెన్సులు అందుబాటులో లేక ప్రసవవేదతో మరణించిన తల్లులు, బిడ్డలున్నారని, డోలీ కట్టుకొని బాలింతలను తరలించిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. ల్యాబ్‌లలో ఆధునిక పరికరాలున్నా వాటిని నిర్వహించే సాంకేతిక నిపుణులు లేక అవి వృథాగా ఉన్నాయన్నారు. ఆరోగ్య శ్రీ పేరుతో వేయి రూపాయిలకు ఉచిత వైద్యం అందిస్తామని సిఎం జగన్ వాగ్దానం చేసినా అమలుకు నోచుకో లేదన్నారు. ప్రభుత్వ వైద్యాన్ని పటిష్టం చేయకుండా ఆరోగ్య శ్రీని సమగ్రంగా అమలు చేయకుండా కొత్త పథకాన్ని ప్రకటించడంతో ఏమి ప్రయోజనం అని ప్రశ్నించారు.జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రవేశపెడుతున్న ఫ్యామిలీ డాక్టర్ పథకంలో సేకరించే డేటాకు భద్రత ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని అన్నారు. వ్యక్తిగత ఆరోగ్య వివరాలు ల్యాబ్ టెస్టుల ద్వారా లభించే సమచారం ప్రైవేటు ఫార్మశీ కంపెనీలకు కట్టబెడితే చాలా ప్రమాదమని చెప్పారు. వేల కోట్ల విలువ చేసే డేటాను ప్రభుత్వం నుండి అక్రమంగా వాడుకొని మందుల కంపెనీలు లక్షల కోట్లు ఆర్జించేందుకు తయారవుతున్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ డేటాను ప్రభుత్వ పరిశోధనా సంస్థలకు మాత్రమే చెందేలా చట్టం చేయాలని అన్నారు.ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో ప్రజలకు ఉచితంగా వైద్యం అందేలా చట్టం చేస్తే అది సమాజానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

వరి సాగు 78 శాతమే...!

- 50 శాతంలోపు నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి మండలాలు
- సెప్టెంబరు 15 తరువాత ముదిరిన ఆకుతో ఉడుపులు
- పంట దిగుబడులు అనుమానమే

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో కొనసాగిన వర్షాభావ పరిస్థితులు వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపాయి. సెప్టెంబర్ 30వ తేదీ వరకు పంట సాగు నమోదు చేసినా 78 శాతం మించలేదు. సాగు నీటి వనరుల్లేక పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో సగం కూడా పంట వేయలేదు. అక్కడక్కడా కురిసిన వర్షాలకు వేసిన పంటలు నీరులేక ఎండిపోతున్నాయి. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు లక్ష ఆరువేల ఎకరాల్లో (78 శాతం) పంట నమోదైంది. జూన్ ఒకటి నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు 694.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా, 609.5 మిల్లీమీటర్లు కురిసింది. -12.3 శాతం వర్షపాతం లోటువుంది. పది మండలాల్లో వర్షపాతం లోటు వుంది. పరవాడ, అనకాపల్లి, మాకవరపాలెం, మునగపాక, అచ్యుతాపురం, యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి మండలాల్లో ఆది నుంచి వర్షపాతం లోటు కొనసాగుతోంది. సాగైన పంటలో దాదాపు సగం పంట లెక్కకు తప్ప దిగుబడులు వచ్చే అవకాశంలేదు. సెప్టెంబరు 15వ తేదీ తరువాత చేసిన ఉడుపుల్లో 50 నుంచి రెండు నెలలు దాటిన ముదిరిన ఆకులు ఎక్కువగా ఉన్నాయి. ముదిరిన ఆకు ఉడుపులు చేయడంతో చేతికి పంట వచ్చే అవకాశం తక్కువని రైతులు చెబుతున్నారు. సగం కంటే ఎక్కువ విస్తీర్ణంలో నమోదైన పంటను చూపి కరువు పరిస్థితులు లేవని ప్రభుత్వం చెప్పేందుకు సెప్టెంబరు 30వ తేదీ వరకు పంట లెక్కలను పరిగణనలోకి తీసుకుంది. తాండవ, రైవాడ, కోణాం, పెద్దేరు జలాశయాల కిందవున్న 75,414 ఎకరాల ఆయకట్టుకు 57,037 (82 శాతం) ఎకరాల్లో వరి పంట రైతులు వేయగలిగారు. పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయలేకపోవడంతో వరి పంట 82 శాతానికి మించి నమోదుకాలేదు.



నక్కపల్లి మండలం, సీతమ్మపాలెంలో ఎండిన ఆకు మడులను పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

తాండవ జలాశయం ఆయకట్టు 32,689 ఎకరాలకు 22,140 ఎకరాల్లో వరి పంట సాగైంది. రైవాడలో 15,344 ఎకరాలకు 13,900 ఎకరాలు, కోణాంలో 12,276 ఎకరాలకు 10,650 ఎకరాలు, పెద్దేరులో 15,105 ఎకరాలకు 10,347 ఎకరాల్లో పంట నమోదైంది. తీవ్ర వర్షాభావంతో నక్కపల్లి మండలంలో 5,125 ఎకరాలకు 1212 ఎకరాల్లో (24 శాతం) రైతులు పంట వేశారు. పాయకరావుపేట మండలంలో 7,920 ఎకరాలకు 2,855 ఎకరాల్లో (36 శాతం), రాంబిల్లి మండలంలో 6,815 ఎకరాలకు 3,130 ఎకరాల్లో (46 శాతం) పంట నమోదైంది. జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు 2021 సెప్టెంబరు 30వ తేదీ నాటికి 1,40,452 ఎకరాలు, 2022లో 1,45,655 ఎకరాల వరి పంట నమోదుకాగా, ఈ ఏడాది 1.06 లక్షల ఎకరాల్లో వరి పంట నమోదైంది.



రంపచోడవరంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

టిడిపి నేతల వినూత్న నిరసన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా పాడేరులో నిరసనలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు క్షేమంగా, ఆరోగ్యంగా బయటకు రావాలని పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని కుమ్మరిపుట్టులో మాజీ ఎమ్మెల్యే నివాసం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘటాలను తలపై ఎత్తుకొని భారీ ఊరేగింపుగా స్థానిక మోదకొండమ్మ ఆలయం వద్ద సమర్పించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ.. చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రంపచోడవరం:టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 19వ రోజుకు చేరాయి. చంద్రబాబుని విడుదల చేయాలని 'బాబు కోసం మేము సైతం అంటూ' టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ దీక్షలు జరుగుతున్న విషయం విధితమే. 19వ రోజు దీక్షలను మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు టిడిపి నాయకులు, కార్యకర్తలకు పూల దండలు వేసి పారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్‌బాబు, జర్తా వెంకట రమణారెడ్డి, పాము అర్జున్, పెంటపాటి అనంత మోహన్, మట్ట మెహర్ బాబా గౌడ్, వడ్డీ రాంబాబు, జెఎస్.నగేష్, అడబాల బాపిరాజు, గొర్లే సునీత, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నవంబర్ 14, 15న

బిర్సా ముండా జయంతి వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వెల్లడి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలర్పించిన ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు బిర్సా ముండా 149వ జయంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో నవంబర్ 14, 15 తేదీలలో జాతీయ స్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వెల్లడించింది. విశాఖ ఎంవిపి కాలనీలో గల గిరిజన భవనంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ రామారావు దొర మాట్లాడుతూ, ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల ఆదివాసీ ప్రతినిధులు సుమారు 500 మంది పాల్గొనున్నారని తెలిపారు. అదిమ జాతులు పంప్రదాయకమైన సాంస్కృతిక కళా బృందాలతో పాల్గొంటారని వివరించారు. రెండు విభాగాలుగా జరిగే ఈ వేడుకలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు 5వ షెడ్యూల్ అధికారాల అమలు ఉమ్మడి పౌరస్మృతి, నూతన అటవీ సంరక్షణ సవరణ చట్టం, జనగణనలో ఆదివాసులకు ప్రత్యేక కాలం, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వంటి జాతీయంగా ప్రభావం చూపే అంశాలతో పాటు జిఒ 3 రద్దు, 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టం, పీసా, సమతా జడ్జిమెంట్ తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరగనున్నాయని తెలిపారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మారావు, గంగరాజు, డాక్టర్ రామకృష్ణ, భీమశంకర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ డైరెక్షన్ వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వివిఎస్ఎఫ్ఎం ఆధ్వర్యాన మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఫిలిం డైరెక్షన్ వర్క్ షాప్ ఆదివారం ప్రారంభమైనట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్స్ ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఈ మూడు రోజుల వర్క్ షాప్‌లో మొదటి రెండు రోజులు డైరెక్షన్‌పై క్లాసు నిర్వహించి, మూడవ రోజు హాజరైన వారు నేర్చుకున్న అంశంతో, రెండు నిమిషాలు లఘు చిత్రాలు నిర్మించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ అష్రఫ్ తెలిపారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన



బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శివప్రసాద్, సర్పంచ్ అప్పారావు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని ఆడాకుల గ్రామంలో అరకు ఎంపీ నిధులు రూ.5 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణానికి ఎంపీ గొడ్డేటి మాధవి భర్త, నేను సైతం ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుశిరెడ్డి శివప్రసాద్, ఆ పంచాయతీ సర్పంచి అప్పారావు, ఉప సర్పంచ్ రాంబాబు, తదితరులు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.5 లక్షలు మంజూరు చేసిన ఎంపీ మాధవికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం పరిధి సిరివెందలపాడులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ టివి.సుబ్బారావు, డాక్టర్ జి.భాస్కర్, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ తదితరులు సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు.

64 మందికి రక్తపరీక్షలు, 15 మందికి థైరాయిడ్ పరీక్షలు, 11 మందికి ఎక్స్ రేలు, 9 మందికి ఫిజియథెరపీ చేశారు. అవసరమైన మందులు, రోగులకు, సహాయకులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్, రామకృష్ణ మఠం ఆఫీస్ ఇన్‌ఛార్జి స్వామీ వేద విద్యానందజీ మహరాజ్, క్యాంప్ కో- ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్లు గాధిరాజు వెంకట లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో భాషా పరిజ్ఞానం

ప్రజాశక్తి -ములగాడ: పుస్తకాల చదవడం వల్ల భాషా పరిజ్ఞానం పెంపొంది, ఆలోచనాశక్తి విస్తృతమౌతుందనిజాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి అన్నారు. మల్కాపురంలోని ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రతి ఆదివారం విద్యార్థులు శాఖా గ్రంథాలయానికి వచ్చి వివిధ రకాల పుస్తకాలను చదవడం ప్రశంసనీయమన్నారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు నీతి కథలను, చందమామ కథలను, పద్యాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారన్నారు. తమ గ్రంథాలయంలో బాలలకు ప్రత్యేక విభాగం ఉందన్నారు. అనంతరం మల్కాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, విజ్ఞాన టాలెంట్ స్కూల్ తదితర పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కథల పుస్తకాలు, దేశ నాయకుల చరిత్రలను ఆసక్తిగా చదివారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి , రచయిత కె. సత్తిరాజు పాల్గొన్నారు.

జివిఎల్ మాటలు నమ్మశక్యంగా లేవు!

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలపై కేంద్రం ప్రకటించాలి

962వ రోజు ఉక్కు రిలేదీక్షల్లో పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ కరణ ప్రక్రియ ఆగిపోయిందని బిజెపి రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నర్సింహరావు చెబుతున్న వట్టి మాటలు నమ్మే స్థితిలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు లేరని, దీనిపై దీపం కమిటీతోగానీ, ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి, ఉక్కుశాఖ మంత్రులతో ప్రకటన చేయించాలని ఉక్కు పరిరక్షణ పోరాటకమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పోరాట కమిటీ చేపట్టిన రిలేదీక్షలు 962వ రోజుకు చేరిన సందర్భంగా స్టీల్ వైఎస్ఆర్‌టియుసికాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొనసాగిన రిలేదీక్షలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై మస్తానప్ప మాట్లాడుతూ, ప్రజల త్యాగాలు, భాగస్వామ్యంతో ఏర్పాటై, లాభాల బాటలో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నష్టాల పాల్జేసి దాన్ని సాకుగా చూపి కార్పొరేట్లకు కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు. అంతేకాక కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు కోడ్‌లుగా మార్చడం, ఇలా అడుగడుగునా కార్మిక, ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం, గడిచిన మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కార్మికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా, కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు నిరాటంకంగా సాగిస్తున్న ప్రభుత్వం ఇపుడు ఒక్కసారిగా మాటమార్చేసి, ప్రయివేటీకరణ లేదంటూ ప్రకటించడాన్ని నమ్మలేకపోతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధికోసమే ఎంపీ జివిఎల్ ఈ మేరకు ప్రకటన చేసినట్టుందన్నారు. ప్రయివేటుపరం చేస్తాం, కాదంటే మూసేస్తామంటూ ఇన్నాళ్లు బెదిరిస్తూ వచ్చిన వారు, ఇపుడు ప్రయివేటీకరణ లేదనడం నమ్మలేనట్టుందన్నారు. జివిఎల్ మాటలను ఇక్కడెవరూ నమ్మరని, దీనిపై ప్రధాని, స్టీల్‌మంత్రులతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.




దీక్షల్లో కూర్చున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై కేంద్రం నిర్ణయం వెనక్కు తీసుకునే వరకు ఉక్కు కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో , పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, కె రామస్వామి, ఎన్ రామారావు, వరసాల శ్రీనివాస్, మార్డుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, పిట్టారెడ్డి, దొమ్మేటి అప్పారావు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం లో పి శ్రీనివాస్ రాజు దాసరి పుల్లారావు బొడ్డ గోవింద్,చిత్రాడ వెంకటరమణ,టేకేటి శ్రీనివాస్, పిట్టా సంజీవ్ రెడ్డి,కణితి మహేష్ పాల్గొన్నారు.

'గీతం' వర్సిటీలో ఆర్కిటెక్చర్ హెరిటేజ్ క్లబ్

భారతీయ సంస్కృతి, ప్రాచీన కట్టడాల పరిరక్షణ లక్ష్యంగా కార్యక్రమాలు



గీతం ఆర్కిటెక్చర్ హెరిటేజ్ క్లబ్ ప్రారంభోత్సవంలో అతిథులతో విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : భారతీయ వారసత్వ సంపదలో ప్రాచీన కట్టడాలు అంతర్భాగమని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్, డీన్ ప్రొఫెసర్ విభూతి సచ్చదేవ్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రాచీన కట్టడాలలో ఒకటైన హవా మహల్‌లోగీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులు సభ్యులుగా హెరిటేజ్ క్లబ్‌ను ప్రారంభించారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్అండ్‌కల్చర్ హెరిటేజ్ (ఇంటాక్), గీతం హెరిటేజ్ క్లబ్ సంయుక్త నిర్వహణలో విశాఖ హవామహల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జైపూర్ వంశపు రాజమాత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజమాత మాట్లాడుతూ, జైపూర్‌లోని జాల్‌మహల్ పునరుద్ధరణ కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొన్నానని, దానికిగాను తనకు లభించిన గుర్తింపును విద్యార్థులకు వివరించారు. ఇంటాక్ విశాఖ సభ్యుడు విశ్వేశ్వరపు ఎడ్వర్డ్‌పాల్ విశాఖపట్నం ప్రాచీన చరిత్ర, అందులో హవామహల్ నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇంటాక్ విశాఖపట్నం కోకన్వీనర్ డాక్టర్ సురేంద్రకుమార్ మాట్లాడుతూ, ప్రాచీన కట్టడాలపై అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, ప్రాచీన వారసత్వ సంపదను పరిరరక్షణకు హెరిటేజ్ వాక్ వంటి కార్యక్రమాలను భవిష్యత్తులో తాము గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హెరిటేజ్ క్లబ్ సభ్యులు వెల్లడించారు.

సుబ్బారెడ్డిని కలిసిన వైసిపి లీగల్ సెల్ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : వైసిపి విశాఖ లీగల్ సెల్ అధ్యక్షుడు బాజినాయుడు, కన్వీనర్ విజయరెడ్డి ఆదివారం ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డిని విశాఖ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందించారు. తమను లీగల్ సెల్ ప్రతినిధులుగా నియమించడంపై వారు ఆనందం వ్యక్తం చేసి, సుబ్బారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి లీగల్‌సెల్ సభ్యులు పాల్గొన్నారు

6న ఆటో కార్మికుల 'చలో విజయవాడ'

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆటో కార్మికులను వేధిస్తున్న జిఒ 21ను రద్దు, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6న ఆటో కార్మికుల చలో విజయవాడను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆరిలోవ జోన్ శ్రీపైడిమాంబ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టాండ్‌వద్ద విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిఒ 21తో ఆటో కార్మికులపై వేధింపులు తీవ్రమయ్యాయన్నారు. దీనిని వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోలకు ఫొటోలు తీసి, ఈ చలానా విధించే విధానాన్ని మానుకోవాలని, విశాఖ నగర పరిధిలో ఆటోలకు రిజిస్ట్రేషన్ చేయాలని, నగరంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. చలో విజయవాడలో పెద్దఎత్తున ఆటో కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. స్టాండ్ అధ్యక్షులు సూరిబాబు, కార్యదర్శి గాడి సూరిబాబు, రమేష్, మహాలక్ష్మి,పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపికి భంగపాటు తప్పదు

ప్రజాశక్తి -భీమునిపట్నం :2024 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మదంతో రెచ్చిపోతున్న వైసిపికి భంగపాటు, టిడిపికి అఖండవిజయం తథ్యమని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు ధీమా వ్యక్తం జేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీపట్ల ప్రజాదరణ విశేషంగా పెరిగిందని, రానున్న ఎన్నికల్లో మంచి మెజార్టీలో అధికారంలోకి వస్తుందన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. అరాచక పాలనతో ప్రజల్లో అప్రతిష్ట మూటగట్టుకున్న వైసిపి, ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి లబ్ధిపొందాలని చూస్తున్న వైసిపి గుణపాఠం తప్పదన్నారు. అక్రమ కేసులో జైలుకెళ్లిన చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూక రాజు, భీమిలి రూరల్ మండల అధ్యక్షులు డిఎ న్ రాజు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె దామోదరరావు, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షులు బోయి రమాదేవి, తెలుగు రైతు నియోజక వర్గ అధ్యక్షులు బోర బంగారు రెడ్డి పాల్గొన్నారు

టిఎన్‌టియుసి నేత ఔదార్యం

- బిటెక్ విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ వితరణ

ప్రజాశక్తి -ములగాడ : విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ టిఎన్‌టియుసి అధ్యక్షులు నక్క లక్ష్మణరావు ఉదారతను చాటుకున్నారు. తన సొంత నిధులతో బిటెక్ చదువుతున్న పేద విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్‌ను అందజేశారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ శ్రీను కుమార్తె గాయత్రిరెడ్డి బిటెక్ చదువుతోంది. పేద కుటుంబానికి చెందిన గాయత్రికి తన సొంత నిధులతో ల్యాప్‌ట్యాప్‌ను సమకూర్చిన లక్ష్మణరావు, ఆదివారం విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. విద్యార్థిని ఉన్నత చదువులకు సాయం అందిస్తానని భరోసానిచ్చారు.కార్యక్రమంలో విశాఖ జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.తారక్ ,హిందుస్థాన్ షిప్‌యార్డ్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రంజాన్ ప్రసాద్, హెచ్‌పిసిఎల్ టిఎన్‌టియుసి నాయకులు క్లబ్ రమణ, నేవల్ డాక్ యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోక్కల కృష్ణ, కోరమండల్ ఫెర్టిలైజర్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి ఉరుకూటి హరియాదవ్, 59వ వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి శంకర్, ఉపాధ్యక్షులు డొంకన రాంబాబు పాల్గొన్నారు.

అలరించిన వారాంతపు నృత్యప్రదర్శనలు

ప్రజాశక్తి-పిఎం పాలెం : మధురవాడ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సరస్వతి నృత్య కళామందిరం కళాకారుల శాస్త్రీయ, జానపద ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి.ఈ సందర్భంగా స్వాగతం, మూషిక వాహన, బ్రహ్మ కడిగిన పాదము, తందనాన హరి, ఇట్టి ముద్దులడే బాలుడు, అదిగో అల్లదిగో , అన్నమాచార్య కీర్తనలు, ధన్ ధనా ధాన్, కొండ కోన, లేచింది గూడెం తదితర కీర్తనలను కళాకారులు హృద్యమంగా నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి సరస్వతి నృత్య దర్శకత్వం వహించగా, రిషిక సాయి, మమత శ్రీ, నందిని, చాందిని, సత్యస్వరూప, తన్వి లెనినా, చిరు హాసిని, రోషిణి, యశస్వి, ప్రణతి, భవ్య, మౌనిక కళాకారులు పాల్గొన్నారు. శిల్పారామం పరిపాలన అధికారి టి. విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.